క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

సామర్లకోట: వైఎస్సార్ సీపీ మండల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం ఉదయం వీకే రాయపురంలో నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు తలారి దొరబాబు తెలిపారు. పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. మండల స్థాయిలోని ఎంపీపీ, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు హాజరుకావాలన్నారు. మండల కమిటీ నియామకం తరువాత మొదటిసారిగా ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశం మండల పార్టీ కమిటీ అధ్యక్షతన జరుగుతుందని, ఆయా గ్రామాలలో సమస్యలను ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో దేవేరులతో స్వామివారు

సామర్లకోట: మండల పరిధిలోని గొంచాల గ్రామంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరుని ఆలయంలో శనివారం స్వామి వారి శ్రవణం నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ కమిటీ నాయకులు సేవలందించారు.

మరిడమ్మ వారికి వెండి ఆభరణాలు


మరిడమ్మ వారికి కంఠాభరణం అందజేస్తున్న దాతలు

పెద్దాపురం: మరిడమ్మ అమ్మవారికి సామర్లకోటకు చెందిన చింతపల్లి సుబ్బారావు, రాధ దంపతులు శనివారం సుమారు 2.50 కేజీల వెండి కంఠాభరణం సమర్పించారు. అలాగే, పట్టణానికి చెందిన లంకాడి రాంబాబు, కాంతం దంపతులు సుమారు 600 గ్రాముల వెండి దీపం కుందులు సమర్పించారు. ఆయా వస్తువులను దాతలు ఈఓ విజయలక్ష్మికి అందజేశారు.

ఆలోచింపజేసిన నాటికలు

బోట్‌క్లబ్: అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ రజతోత్సవ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న నాటిక పోటీలు నగర వాసులను అలరించాయి. శనివారం పడాల వీరభద్రరావు స్మారక కళాప్రాంగణంలో స్వరాభిషేకం పేరిట జరిగిన సినీ సంగీత విభావరి ఆహూతులను అలరింపజేసింది. అనంతరం ఆంధ్రశ్రీ పురస్కార ప్రదానోత్సవంలో భాగంగా అన్నంరాజు సీతాపతిరావుకు పురస్కారాన్ని అందజేశారు. నాటికల ప్రదర్శనలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన గోవాడ క్రియేషన్స్ బృందం 'అమ్మ చెక్కిన బొమ్మ' నాటిక ప్రదర్శించింది. తల్లి ప్రాముఖ్యాన్ని వివరిస్తూ, భగవంతుడైనా అమ్మ తరువాతేనని తెలియజేస్తూ ప్రదర్శించిన సన్నివేశాలు మనసులను హత్తుకున్నాయి. అనంతరం విశాఖకు చెందిన భద్రం ఫౌండేషన్ బృందం ప్రదర్శించిన 'దొందూ దొందే' నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. కార్యక్రమంలో భాగంగా బి.వెంకన్నబాబుచే అశ్వత్థామ ఏకపాత్రాభినయం ఆకట్టుకుంది. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కె.అచ్యుతరామారెడ్డి, ప్రధాన కార్యదర్శి పంపన దయానందబాబు, సభ్యులు, కళాకారులు, కళాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బ్యాంకింగ్ సేవలపై అవగాహన

బాలాజీచెరువు: బ్యాంకుల జాతీయాకరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక దేవాలయం వీధిలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా అధికారులు రైతులు, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకింగ్ సేవలపై శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. బ్యాంకు చీఫ్ మేనేజర్ నరసింహమూర్తి మాట్లాడుతూ బ్యాంకుల జాతీయాకరణ భారత ఆర్థిక వ్యవస్థలో ఒక మైలురాయన్నారు. 1969 జూలై 19న 14 ప్రైవేట్ బ్యాంకులను జాతీయాకరించడంతో గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవలు విస్తరించాయన్నారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా జూలై 31 తేదీ వరకూ రైతుకు అండగా నిలిచేందుకు రైతు మాసం కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. దీనిలో భాగంగా రైతు దినోత్సవాన్ని తమ బ్యాంకులో నిర్వహిస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల ఆర్థిక క్రమశిక్షణ, రుణాల చెల్లింపులో వారు పాటిస్తున్న నిబద్ధత ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విద్యాసాగర్, ఇతర బ్యాంకు సిబ్బంది, రైతులు బీవీవీ సత్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో 'కూటమి' విఫలం

- గాలిలో సూపర్ సిక్స్ హామీలు
- ప్రజలను నమ్మించి మోసం చేసిన బాబు
- బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీలో కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు


క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న దొరబాబు


సమావేశానికి హాజరైన పట్టణ కార్యకర్తలు

పెద్దాపురం: రాష్ట్రంలో ప్రజాకర్షక పథకాల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఎన్నికల ముందు చంద్రబాబు సూపర్ సిక్స్ అని ప్రజలను నమ్మించి మోసం చేశారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక మున్సిపల్ సెంటర్‌లోని అంబేడ్కర్ భవనంలో శనివారం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అధ్యక్షతన 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' పేరుతో పట్టణస్థాయి పార్టీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కుల, మతాలు, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు నేరుగా సంక్షేమ పథకాలు అమలు చేసి, ఇంటింటికీ పింఛన్, రేషన్, సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచినా సూపర్ సిక్స్ పథకాల జాడే లేదన్నారు. వందకు పైగా హామీలిచ్చి పక్కన పెట్టిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని దొరబాబు పిలుపునిచ్చారు. నిరుద్యోగులకు నెలకు మూడు వేలు ఇస్తానని ఇచ్చిన హామీ ఏమైందన్నారు. 19 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు 1500 రూపాయలు ఎపుడిస్తారని ప్రశ్నించారు. రెండు పంటలు పూర్తయినా అన్నదాత సుఖీభవ పథకం అందించలేదన్నారు. ధాన్యానికి సరైన మద్దతు ధర ఇవ్వకపోగా కొనుగోలు చేసిన ధాన్యానికి కూడ నెలల తరబడి సొమ్ములు ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు తెలుసుకుంటున్నారని, వారు చేస్తున్న అన్యాయం, అక్రమాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలన్నారు. నియోకవర్గంలో ఏ కార్యకర్తకు ఆపద వచ్చినా ముందుంటానని, అధికార పార్టీ నాయకులు బెదిరింపులు, కేసులకు భయపడవద్దని దొరబాబు భరోసా ఇచ్చారు. త్వరలోనే బాబు మోసాలు, కూటమి నేతల అక్రమాలపై ప్రజల తరఫున నిరసన కార్యక్రమాలకు సిద్ధం కావాలని దొరబాబు పిలుపునిచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు, పార్టీ అయ్యరక విభాగం రాష్ట్ర అధ్యక్షులు ఆవాల లక్ష్మీనారాయణ, పార్టీ జిల్లా నాయకులు యినకొండ వీర విష్ణు చక్రం, వీరంరెడ్డి నాని, అప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు తదితరులు మాట్లాడుతూ పార్టీ బూత్ కమిటీల నుంచి మండల, పట్టణ కమిటీలు పూర్తి స్థాయిలో నియమించినట్టు తెలిపారు. నియమితులైన ప్రతి సభ్యుడూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అహర్నిశలు శ్రమించాలన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత మొదలైందని, ప్రతి కార్యకర్త ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి తరఫున ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలన్నారు. అనంతరం క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను దొరబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆగ్రో మాజీ డైరెక్టర్ సయ్యద్ జానీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు కాపగంటి కామేశ్వరరావు, సీనియర్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్, కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్లి వీరరాఘవులు, కొట్టేటి పవన్, పప్పల దుర్గారావు, గోకేడ అప్పారావు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ, చింతా శ్రీనివాసరావు, బొబ్బిలి హరిబాబు, గడపా శివ బాబు, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మాణం పూర్తి


పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్మితమైన కల్వర్టు

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం ఎదుట కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ నెల మూడో తేదిన సాక్షి దినపత్రికలో 'శిథిలమైన కల్వర్టు.. ప్రయాణికుల ఇక్కట్లు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. ఒక లోడ్ ట్రాక్టర్ ఈ కల్వర్టు మీదుగా వెళ్లడంతో డ్రైన్‌పై ఏర్పాటు చేసిన శ్లాబ్ విరిగిపోయిన విషయం తెలిసిందే. ఈ మేరకు ప్రయాణికుల సమస్యలపై కథనం ప్రచురితమవడంతో కమిషనర్ ఎ.శ్రీవిద్య చొరవ తీసుకుని నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయించారు. దాంతో వాహన చోదకులు, సమీపంలోని పాఠశాల విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

వైద్య ఉద్యోగుల హక్కులు కాపాడాలి

- అన్యాయమైన ఉత్తర్వులను రద్దు చేయాలి
- సీహెచ్‌సీ వైద్యాధికారి చర్యలను నిలదీసిన ఏపీజీఈఏ నాయకులు


వైద్యాధికారితో చర్చిస్తున్న సంఘం నాయకులు

పిఠాపురం: స్థానిక వైద్య ఉద్యోగులపై అన్యాయంగా జారీ చేసిన ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) నాయకులు డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పనితో పాటు 'ఆన్–కాల్ డ్యూటీ' పేరుతో అదనపు పని చేయిస్తూ, ఆ విధులకు హాజరు కాకుంటే చర్యలు తీసుకుంటామని స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి జారీ చేసిన ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని సంఘం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య రంగంలోని ఉద్యోగులకు ప్రజాస్వామ్య హక్కులు లేవా అని వారు ప్రశ్నించారు. పారా మెడికల్ సిబ్బంది ఆన్ కాల్ డ్యూటీకి తప్పనిసరిగా హాజరుకావాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామంటు సీహెచ్‌సీ వైద్యాధికారి సుజాత ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. దీంతో తమపై అదనపు భారం మోపుతున్నారని ఉద్యోగులు సంఘం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో శనివారం తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్‌వర్మ నాయకత్వంలో సంఘం ప్రతినిధులు పిఠాపురం ఆస్పత్రికి చేరుకుని వైద్యాధికారితో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా గిరిప్రసాద్ వర్మ మాట్లాడుతూ, హాస్పిటల్ ఉద్యోగుల పట్ల మానవీయ కోణాన్ని పక్కన పెట్టి, వారిని నిర్బంధించి పనికి ఆదేశించడాన్ని తమ సంఘం ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. ఉద్యోగులకు ఎక్కడ అన్యాయం జరిగినా పోరాడాలని తమ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ ఆదేశించారని, ఏ శాఖ ఉద్యోగులకు ఇబ్బంది వచ్చినా న్యాయం కోసం పోరాడతామని తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షులు పి.రవి కుమార్ మాట్లాడుతూ వైద్య రంగంలో గతంలో 20 నుండి 30 ఓపీడీలు ఉన్న సమయంలో నిర్ణయించిన సిబ్బంది విధానంతోనే నేడు వందల్లో ఓపీడీలు పెరిగినా అదే సిబ్బందితో కొనసాగుతున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఆన్–కాల్ డ్యూటీకి పారామెడికల్ సిబ్బందికి అలవెన్సులు ఇవ్వకుండా నిర్బంధ ఆదేశాలు ఎలా ఇస్తారని ఆయన వైద్యాధికారిని ప్రశ్నించారు. ఇటువంటి చర్యలు పునరావృతమైతే తమ సంఘం ప్రతిఘటిస్తుందని హెచ్చరించారు. భవిష్యత్తులో సమస్యలు రాకుండా చూడాలని, లేకపోతే చూస్తు ఊరుకునేది లేదని సంఘం నాయకులు హితవు పలికారు. ఈ చర్చల్లో సంఘం ఉపాధ్యక్షులు కె.వెంకటేశ్వర రావు, ట్రేడ్ యూనియన్ నాయకులు ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

- రీజినల్ డైరెక్టర్ నాగనరసింహారావు
- అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష


మున్సిపల్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న రీజినల్ డైరెక్టర్ నాగనరసింహారావు

సామర్లకోట: రీజియన్ పరిధిలోని మున్సిపాలిటీలు ఆర్థికంగా బలోపేతం చేయడానికి సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నట్లు రీజినల్ డైరెక్టర్ నాగనరసింహారావు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జిల్లాలోని మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. కమిషనర్ ఎ.శ్రీవిద్య, చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ఆర్డీకి స్వాగతం పలికారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రీజియన్ పరిధిలో ఏడు జిల్లాల్లోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, పట్టణ స్థానిక సంస్థలను బలోపేతం చేసేలా ప్రతి నెల ఒక చోట సమావేశం నిర్వహించి ఆయా అంశాలపై సమీక్షిస్తున్నట్టు తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో అనధికార కట్టడాలను గుర్తించి సంబంధిత వర్గాలకు నోటీసులు ఇవ్వడం, చార్జిషీట్ నమోదు చేయడం, వారి నుంచి అపరాధ రుసుం వసూలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. దీనివల్ల మున్సిపాలిటీల ఆదాయం పెరుగుతుందన్నారు. ప్రస్తుతం వీధి వ్యాపారుల సర్వే జరుగుతోందని, సామర్లకోట మున్సిపాటీలో సర్వే 67 శాతం ఉండగా మిగిలిన మున్సిపాలిటీల్లో 80 శాతం పూర్తి అయిందన్నారు. సర్వే అనంతరం మూడు జోన్లుగా ఏర్పాటు చేసి వారికి ఆయా జోన్లలో మాత్రమే విక్రయాలు చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. ఇదే సమయంలో వారిని ఐదుగురు చొప్పున గ్రూపులుగా ఏర్పాటు చేసి రుణాలు ఇచ్చి వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తామని చెప్పారు. వారికి పోలీసుల సహకారంతో ప్రత్యేకంగా ఒక ప్రదేశం ఏర్పాటు చేయడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఉండటమే కాకుండా, శానిటేషన్ సమస్య ఉండదన్నారు. ట్రేడ్ లైసెన్సులపై మున్సిపల్ సిబ్బంది చూపాలని, ఏటా ఫీజు పెంచాలన్నారు. గతంలో సిబ్బంది కొరత ఉండేదని, అయితే ప్రస్తుత మున్సిపాలిటీ సచివాలయంలో ఉన్న సిబ్బందితో అనధికార కుళాయిలను సర్వే చేయించి కౌన్సిల్ సహకారంతో నియంత్రిస్తున్నట్టు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. వృద్ధులు, దివ్యాంగులు కార్యాలయానికి వచ్చే అవకాశం లేకపోవడంతో డయల్ యువర్ కమిషనర్ ఏర్పాటు చేయాలని కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మున్సిపల్ కమిషనర్లు ఎ.శ్రీవిద్య, వెంకట్రావు, శ్రీకాంత్‌రెడ్డి, సత్యనారాయణ, కనకారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దోమల దండయాత్ర


కట్టమూరు పంచాయతీలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది (ఫైల్)

- మూలకు చేరిన ఫాగింగ్ మెషీన్లు
- పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు
- పట్టించుకోని అధికారులు
- పారిశుధ్య చర్యలు శూన్యం

పెద్దాపురం: గత ప్రభుత్వంలో వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో దోమల నివారణకు సాయంత్రం వేళల్లో ఫాగింగ్ ద్వారా దోమల నివారణకు చర్యలు చేపట్టి వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టేవారు. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం ప్రజారోగ్య పరిరక్షణను గాలికి వదిలేసింది. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు నిత్యం రోగులతో కిటకిటలాడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పరిసరాల పరిశుభ్రత కీలకమైనప్పటికీ సత్వర చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫమవుతున్నారు. ప్రజలు రోగాల బారిన పడుతున్నా ఎక్కడా ఫాగింగ్ చేస్తున్న దాఖలాల్లేవు. ఉన్నతాధికారులు వచ్చినప్పుడో.. నేతల సందర్శనలప్పుడో మినహా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టడం లేదు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా మున్సిపల్, గ్రామ పంచాయతీలకు ఫాగింగ్ మెషీన్లు అందజేశారు. వీటి నిర్వహణకు గ్రామాల్లో పంచాయతీ సాధారణ నిధులు, పట్టణంలో శానిటరీ విభాగంలో నిధుల ద్వారా పరిశుభ్రత రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది. వీటి నిర్వహణకు సుమారు రూ.700 నుంచి రూ.800 వరకు ఖర్చు అవుతుంది. నిధుల లేమి పేరుతో కూటమి ప్రభుత్వ పాలకులు ఐదు నెలలుగా వీటిని పక్కన పెట్టించడంతో ఎక్కడికక్కడే వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు పారిశుద్ధ్యం మెరుగుపరచడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో దోమల ఉధృతి పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

నివారణకు చర్యలు చేపట్టాలి



పట్టణంలో క్షీణించిన పారిశుధ్యం వల్ల దోమల ఉధృతి ఎక్కువైంది. ఎక్కడ నుంచున్నా దోమ పోటుతో ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– తాడి కస్తూరి, గృహిణి, నాగంపేట, పెద్దాపురం

మెషీన్లు అందుబాటులోకి..



ఫాగింగ్ మెషీన్ వినియోగాన్ని త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తాం. ప్రస్తుతానికి దోమల నివారణకు డ్రెయిన్లలో పిచికారీ చేయిస్తున్నాం. మెషీన్లు అందుబాటులో ఉన్నా మరమ్మతుల వల్ల ఇబ్బంది ఉంది.

– శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

పోలీసు స్టేషన్లలో ప్లాస్టిక్ నిషేధం


సూర్యారావుపేట బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న ఎస్పీ బిందు మాధవ్ తదితరులు


పోలీసు అధికారులు, సిబ్బందితో ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ

- ఎస్పీ బిందుమాధవ్
- సూర్యారావుపేట బీచ్‌లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర

కాకినాడ రూరల్: పర్యావరణ హితాన్ని కోరుకుంటూ జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్లలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని ఎస్పీ బిందుమాధవ్ పిలుపు ఇచ్చారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా సూర్యారావుపేట బీచ్‌లో ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం ఉదయం ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ తొలుత పోలీసు అధికారులు, సిబ్బందితో ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. సిబ్బందితో కలిసి తీరంలో ఉన్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు బదులుగా ప్రత్యామ్నాయాలను వినియోగించుకోవాలన్నారు. గాజు సీసాలు, కాగితపు ప్యాకింగ్, గుడ్డ సంచులు వంటివి వినియోగించడం వల్ల పర్యావరణానికి దెబ్బ అన్నారు. జిల్లా వ్యాప్తంగా సబ్ డివిజన్ల పరిధిలోని అన్ని సర్కిళ్ల, పోలీసు స్టేషన్లలో అధికారులు, సిబ్బంది తమ కార్యాలయ పరిసరాలలో ప్లాస్టిక్ రహిత వాతావరణం సృష్టించి, పర్యావరణాన్ని రక్షించే దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో అడ్మిన్ ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, ఎస్‌డీపీఓ పాటిల్ దేవరాజ్ మనీష్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరిబాబు, రూరల్ సీఐ చైతన్య కృష్ణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నరసింహమూర్తి, తిమ్మాపురం ఎస్సై గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరపలో..

కరప: డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నియంత్రణపై సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు.

కలెక్టరేట్‌లో..


కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న జిల్లా అధికారులు, వికాస, కలెక్టరేట్ సిబ్బంది

కాకినాడ సిటీ: ప్రతి నెల మూడో శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, కార్యాలయ ఆవరణలో ఉన్న వికాస, పౌరసరఫరాలు, డ్వామా, ప్రణాళిక శాఖల అధికారులు, కలెక్టరేట్ వివిధ విభాగాల అధిపతులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇతర సిబ్బంది అక్కడి ఆవరణను శుభ్రం చేసి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేసేందుకు తమ వంతు కృషి చేస్తామంటూ మానవహారం నిర్వహించారు. అనంతరం డీఆర్వో వారితో ప్రతిజ్ఞ చేయించారు. డ్వామా పీడీ ఎ.వెంకటలక్ష్మి, సీపీవో పి.త్రినాథ్, వికాస పీడీ కె.లచ్చారావు, కలెక్టరేట్ ఏవో ఎస్ రామమోహన్, వివిధ విభాగాల అధిపతులు, పౌరసరఫరాలశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నీరా.. పారే వడివడిగా..!


తాటిపర్తి వద్ద నీటి ఎద్దడితో మాడిపోతున్న ప్రత్తి చేను

- నీటి జాడ కోసం అన్నదాత ఎదురుచూపు
- వానలు లేక, గోదారి రాక రేగడికి నెర్రెలు
- దయచూపాలని అధికారులకు వేడుకోలు


గొల్లప్రోలు మండలం చెందుర్తి వద్ద దుక్కి దున్ని ఖాళీగా ఉన్న రేగడి భూములు

పిఠాపురం: వాణిజ్య పంటలకు పెట్టింది పేరైన రేగడి నేలలు నేడు వర్షాభావ, నీటి ఎద్దడితో నిరుపయోగంగా మారుతున్నాయి. వర్షాలు లేక వేసిన పంటలు ఎండుతూ ఒకవైపు, నీరు రాక పంటలు వేసే పరిస్థితి లేక మరో వైపు ఆ భూములు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది పాలకుల నిర్లక్ష్యంతో సాగు నీరు అందక ఖరీఫ్ సాగు ఇప్పటికీ ప్రారంభం కాకపోగా తక్కువ నీటి వసతితో పంటలు పండే రేగడి నేలలు నీటి ఎద్దడితో నెర్రెలు వేస్తున్నాయి. గొల్లప్రోలు మండలం తాటిపర్తి, దుర్గాడ, చేబ్రోలు, చెందుర్తి, వన్నెపూడి తదితర ప్రాంతాల్లో ఇప్పటికే సాగు చేసిన పత్తి, మొక్కజొన్న, మిరప, వంగ, ఆనప, బీర, దొండ వంటి పంటలు సాగునీరు లేక ఎండిపోతున్నాయి. ఇప్పటికే వంద శాతం భూముల్లో పంటలు వేయాల్సి ఉండగా నీరు లేక, వర్షాలు రాక వందల ఎకరాల రేగడి నేలలు వేసవి దుక్కులు దున్ని ఖాళీగా దర్శనమిస్తున్నాయి. కాలువలకు నీరు ఇస్తే పంటలు కాపాడుకుంటామని రైతన్నలు బతిమాలుకుంటున్నారు.